క్లుప్తంగా

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

• తహసీల్దార్ తాడ్డి గోవింద



మాట్లాడుతున్న తహసీల్దార్ తాడ్డి గోవింద

పూసపాటిరేగ: ప్రజలు తెలియజేసిన రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ తాడ్డి గోవింద అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అందించిన అర్జీలపై తాత్సారం తగదన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన ధ్రువపత్రాల మంజూరుకు క్షేత్రస్థాయి పరిశీలన పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పీవీ మాధురి, రీసర్వే డీటీ కల్యాణి, సీనియర్ అసిస్టెంట్ సత్యారావు పాల్గొన్నారు.

రామతీర్థంలో కొనసాగుతున్న వసంతోత్సవాలు



స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి కల్యాణ వసంతోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామి సన్నిధిలో అర్చకులు గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సుమారు 40 మంది వేద పండితుల సమక్షంలో పారాయణాలు చేపట్టారు. అలాగే లక్ష తులసీ దళార్చన, కుంకుమార్చన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సాయి మందిర వార్షికోత్సవం





సత్యసాయి మందిరం (ఇన్‌సెట్లో) సత్యసాయి బాబా

డెంకాడ: మండలంలోని పినతాడివాడ నిర్మించిన సాయి మందిరం ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్న ఏర్పాట్లనూ సాయి భక్తులు పూర్తి చేశారు. ఉదయం 5.20 గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన కార్యక్రమాలతో వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని భజన బృంద భక్తులు తెలిపారు. అనంతరం 8 గంటలకు సత్య సాయి సమితి జిల్లా అధ్యక్షుడు వీవీఎస్ ఎస్ సునీల్‌కుమార్ రథో ప్రశాంతి పతాకావిష్కరణ చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి దివ్య మంగళహారతి, అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం నామ సంకీర్తన కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

అర్హులందరికీ ఉచిత వైద్యసేవలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ రాంబాబు

విజయనగరం ఫోర్ట్: అర్హులందరికీ ఎన్టీఆర్ వైద్యసేవలో (ఆరోగ్యశ్రీ) భాగంగా ఉచిత వైద్యసేవలు అందించాలని ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ దూబ రాంబాబు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఆరోగ్య మిత్రాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సమయానికి ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ వేయాలన్నారు. ఆన్‌బెడ్ అప్‌డేషన్ తప్పనిసరిగా జరిగేటట్లు చూడాలని సూచించారు. ప్రతి రోగికీ నగదు రహిత సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో టీమ్ లీడర్లు తుంపల్లి జనార్దనరావు, ఎ. భాను ప్రసాద్, ఆర్.ముత్యాలనాయుడు, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

• రోజురోజుకూ పెరుగుతున్న వేసవి తాపం
• ఉపాధి వేతనదారులు, కార్మికులకు వడదెబ్బ సోకే అవకాశం
• జాగ్రత్తలు తీసుకోవాలి : అధికారులు



ఎండలో పనిచేస్తున్న వేతనదారులు (ఫైల్)

విజయనగరం గంటస్తంభం: వేసవితాపం రోజురోజుకూ పెరుగుతోంది. ఏప్రిల్ మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రోజంతా మండుటెండలో కష్టించి పని చేసే వేతనదారులు, కార్మికులు తగు జాగ్రత్తలు పాటించాలని సంబంధిత శాఖాధికారులు సూచిస్తున్నారు. ఉపాధి కోసం ఆరాటపడకుండా మండే ఎండలో జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేస్తున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వడదెబ్బకు గురి కావడంతో పాటు అనారోగ్య సమస్యల బారిన పడతారని చెబుతున్నారు. ఎండల్లో ఇబ్బంది పడకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని సూచిస్తున్నారు.

తారెత్తిస్తున్న ఎండలు..

జిల్లాలో ఎండలు తారెత్తిస్తున్నాయి. అధిక వేడి, ఉక్కబోతకు జిల్లావాసులు అల్లాడిపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తుండడంతో బయటికి రావాలంటేనే ప్రజలు ఆలోచిస్తున్నారు. కాగా రానున్న నాలుగైదు రోజుల్లో మరింత తీవ్రస్థాయికి ఉష్ణోగ్రతలు చేరుకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రజలు మరింతగా భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం 40 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు. పని ప్రాంతంలో చల్లని నీరు, నీడ వసతి ఏర్పాటు చేసుకోవాలి. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫ్లూయిడ్స్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవడం ఉత్తమం. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ ప్రదేశంలో కార్మికులు పనిచేయకుండా జాగ్రత్తలు పాటించాలి. ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా సుమారు 6 లక్షల మంది ఉపాధి వేతనదారులు, కార్మికులున్నారు. ముఖ్యంగా ఉపాధి వేతనదారులు, దుకాణాల్లో పనిచేసే కలాసీలు, భవన నిర్మాణ కార్మికులు, తదితర శ్రమజీవులు కూడా అప్రమత్తంగా ఉండాలి. లేనిపక్షంలో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడక తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



వేసవి ఆరంభంలోనే ఎండలు మండుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా బయట ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ముఖ్యంగా ఎండలో పనిచేసే రైతులు, భవన నిర్మాణ, ఉపాధి హామీ వేతనదారులు జాగ్రత్తగా ఉండాలి. ఎండలో పనిచేయడం, తిరగడం వల్ల శరీరంలోని నీటిశాతం తగ్గి డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో క్రమం తప్పకుండా నీటిని తాగాలి. పండ్ల రసాలు, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి తీసుకుంటే వడదెబ్బ బారిన పడకుండా ఉంటారు.

– ఎస్‌డీవీ ప్రసాదరావు, విజయనగరం జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్

తీసుకోవాల్సిన జాగత్తలు

• సాధ్యమైనంత వరకు చల్లని ప్రదేశాల్లో పనులు చేసుకోవాలి.
• వదులైన పలుచని కాటన్ దుస్తులు ధరించాలి.
• తలకు టోపీ పెట్టుకోవడం మంచిది.
• మిట్ట మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల మధ్య ఎండలో తిరగకూడదు.
• నీటిని ఎక్కువగా తాగాలి. మజ్జిగ తీసుకోవాలి
• గది ఉష్ణోగ్రతలను తగ్గించుకోవాలి. చక్కని వెంటిలేషన్ ఏర్పాటు చేసుకోవాలి.
• ఇంటి పైకప్పు మీద గడ్డి లాంటివి ఉంచి చల్లటి నీరు పట్టించాలి.
• వడదెబ్బకు గురైన వ్యక్తికి చల్లని గాలి అందేలా చూడాలి. దుస్తులు వదులు చేయాలి.
• వడదెబ్బకు గురైన వ్యక్తి శరీరాన్ని తడి గుడ్డతో తుడవాలి.
• బాధితుడ్ని సాధ్యమైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకురావాలి.

విధానాలు మార్చుకోకపోతే ఉద్యమం తప్పదు

• సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అశోక్



కార్మికులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: దేశ ప్రజా సంస్థలు, కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు ధారదత్తం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే ప్రతిఘటన తప్పదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ హెచ్చరించారు. ఈ మేరకు విజయనగరం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ సర్కారు రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, బొగ్గు గనులు, బీఎస్ఎన్ఎల్, తదితర సంస్థలు, ఆస్తులను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని చెప్పారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచిందని ఆరోపించారు. లేబర్‌కోడ్‌లను రద్దు చేయడంతో పాటు ప్రభుత్వ రంగ ఆస్తులను పరిరక్షించకపోతే ఉద్యమం తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని పాట్లు



కుళాయి కనెక్షన్ వేయలేదంటున్న మహిళ



కుళాయిలు లేకపోవడంతో సమీప ప్రాంతం నుంచి నీరు తెచ్చుకుంటున్న ప్రశాంతినగర్ చివరి వీధి వాసులు

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో పలు ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం తిప్పలు పడుతున్నారు. నగరంలోని 6వ డివిజన్ ప్రశాంతినగర్ ప్రాంతంలో చివరి వీధిలో నివసిస్తున్న ప్రజలకు కార్పొరేషన్ ద్వారా తాగునీటి సౌకర్యం లేకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో అక్కడి సమస్యను గుర్తించి ఆ ప్రాంత ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసినప్పటికీ.. ఇప్పటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో సమీప ప్రాంతానికి వెళ్లి అక్కడి వారిని బతిమాలుకుని నీరు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారిగా సతీష్‌కుమార్



సతీష్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న సత్య విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ పరిధిలో జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారిగా సీతం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.సతీష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కళాశాలలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో సత్య విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ... ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలతో విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించాలన్నారు. అనంతరం సతీష్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డీవీ రామ్మూర్తి, డైరెక్టర్ ఎం. శశిభూషణరావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

5న 'గురువందనం'



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు రాజ్యలక్ష్మి, నీలాద్రిరావు, త్రినాథరావు, తదితరులు

విజయనగరం టౌన్: వాయులీన విద్యాప్రవీణ, సంగీత విద్యానిధి సద్గురు ద్వారం దుర్గాప్రసాదరావుకు గురువందన కార్యక్రమాన్ని ఈ నెల 5న స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు శిష్యప్రశిష్య సమాఖ్య వైస్ చైర్మన్‌లు సీహెచ్.రాజ్యలక్ష్మి, పి.త్రినాథరావు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక గురజాడ స్వగృహంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత ద్వారం దుర్గాప్రసాదరావును ఘనంగా సత్కరించనున్నట్లు చెప్పారు. అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి, మండా సుధారాణి, కట్టమూరి చంద్రశేఖరం, కవిరాయని ఏవీఎల్ఎన్.శాస్త్రి, చాగంటి కొండలరావు హాజరవుతారని తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థులు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొగ్రాం కన్వీనర్ ఎం.నీలాద్రిరావు, కోశాధికారి ఎమ్.ధనలక్ష్మి, సభ్యులు కె.విజయలక్ష్మి, ఎంవీ కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

హుద్‌హుద్ గృహ సముదాయంలో మౌలిక సదుపాయాలు

• కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



హుద్‌హుద్ గృహ సముదాయంలో మౌలిక సదుపాయాలు పరిశీలిస్తున్న కమిషనర్, తదితరులు

విజయనగరం: నగర ప్రజల కోసం లంకాపట్నం ప్రాంతంలో నిర్మించిన హుద్‌హుద్ ఇళ్ల సముదాయంలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయి పర్యటన భాగంగా గుమ్చీ ప్రాంతంలో జరుగుతున్న తాత్కాలిక బీటీ రోడ్డు మరమ్మతులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ప్రశాంతినగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. టీటీడీ కల్యాణ మంటపం ఎదురుగా కోట గోడకు ఆనుకుని నివాసముంటున్న వారిని లంకాపట్నంలో ఉన్న గృహ సముదాయాలు వద్దకు వెళ్లిపోవాలని సూచించారు. అక్కడ అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అక్కడి నుంచి హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి లంకాపట్నంలో ఉన్న హుద్‌హుద్ ఇళ్ల సముదాయం వద్దకు వెళ్లారు. అక్కడ తాగునీటి సరఫరా వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధరించాలని సిబ్బందికి సూచించారు. అలాగే వీధి దీపాల సక్రమ నిర్వహణకు చొరవ చూపాలలన్నారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ సింహాచలం, సీఎంఎం సన్యాసిరావు, డీఈలు ప్రసాద్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ పునఃప్రారంభోత్సవాలు



నూతన విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో రామాలయ పునః ప్రారంభోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామానికి చెందిన భక్తులు గురువారం రామాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి నూతన విగ్రహాల వద్ద పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. విగ్రహాలకు పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. యాగశాలలో నిర్విరామ హోమాలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు స్వామివారి నూతన విగ్రహాలను ఆలయంలో ప్రతిష్టిస్తామని వేద పండితులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, గ్రామ పెద్దలు కోరాడ శ్రీను, నల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్తలుగా మహిళలు

• జిల్లా పరిశ్రమల శాఖ ఎ.డి రామకృష్ణ



శిక్షణకు విచ్చేసిన మహిళతో జిల్లా పరిశ్రమల శాఖ ఎ.డి రామకృష్ణ, తదితరులు

డెంకాడ: మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించాలని జిల్లా పరిశ్రమల శాఖ ఎ.డి రామకృష్ణ అన్నారు. మండలంలోని పెదతాడివాడలో ట్రెడ్జ్ ఐటీ సంస్థ ఆధ్వర్యంలో ర్యాంప్ పథకం ద్వారా వ్యవస్థాపక నైపుణ్యాభివృద్ధిపై మహిళలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అభివృద్ధి చెందితేనే కుటుంబం కూడా బాగుంటుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలు నిజ జీవితానికి అన్వయిస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. ఈ నెల 12 వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ చప్ప రూప, జిల్లా పరిశ్రమల శాఖ ఐపీఓ రమణమూర్తి, రిసోర్స్‌పర్సన్ శీలం అనూషా, తదితరులు పాల్గొన్నారు.

నియామకం..



ఎంపీపీ సుధారాణికి నియామక పత్రాన్ని అందజేస్తున్న సీఐ

నెల్లిమర్ల: ఏపీ సంపూర్ణ సారా నిషేధ కమిటీ (నవోదయం 2.0) మండల అధ్యక్షురాలిగా ఎంపీపీ అంబళ్ల సుధారాణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కమిటీలో సభ్యులుగా తహసీల్దార్ సుదర్శనరావు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, ఎక్సైజ్ సీఐ వెంకటరావు, భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై గణేష్, తదితరులుంటారు. అలాగే ప్రతి గ్రామానికీ ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, వీఏఓలు సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ఎంపీపీకి నియామకపత్రాన్ని ఎక్సైజ్ సీఐ వెంకటరావు గురువారం అందజేశారు. కార్యక్రమంలో సౌత్‌సెంట్రల్ రైల్వేబోర్డ్ మెంబర్ అంబళ్ల శ్రీరాములు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సే లక్ష్యం

• స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్ ఈపు విజయ్‌కుమార్



ధ్రువపత్రాలతో విద్యార్థులు

నెల్లిమర్ల: సమాజ శ్రేయస్సే లక్ష్యంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు అందించాలని ఆ సంస్థ జిల్లా కమిషనర్ ఈపు విజయ్‌కుమార్ సూచించారు. నెల్లిమర్ల పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రథమ, ద్వితీయ దశల్లో శిక్షణ పూర్తిచేసుకున్న 50 మంది గైడ్స్ విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైనింగ్ కమిషనర్ వసాది సూరిబాబు, పాఠశాల హెచ్ఎం శారదతో కలిసి గురువారం ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనిట్ గైడ్ టీచర్లు సుజాత, శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

• 27వ డివిజన్ వార్డు పర్యటనలో అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు



జొన్నగుడ్డి ప్రాంతంలో పర్యటిస్తున్న అధికారులు, స్థానికులు

విజయనగరం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి తగు చర్యలు చేపట్టేందుకు డివిజన్ పర్యటనలు చేస్తున్నామని విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ కె. అప్పలరాజు అన్నారు. గురువారం స్థానిక 27వ డివిజన్ జొన్నగుడ్డి ప్రాంతంలో కార్పొరేటర్ దుప్పాడ సునీత, సచివాలయ సిబ్బంది, తదితరులతో కలిసి పర్యటించి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాలలో కాలువలు సరిగా లేవని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అలాగే విద్యుత్ దీపాలు అక్కడక్కడా పనిచేయడం లేదని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు మాట్లాడుతూ.. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశాలతో ప్రతి గురువారం డివిజన్ పర్యటనలు చేపడుతున్నామన్నారు. ప్రతి డివిజన్‌కు 20 లక్షల రూపాయల చొప్పున సాధారణ నిధులు కేటాయించడం జరిగిందని వాటితో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్పొరేటర్ దుప్పాడ సునీత మాట్లాడుతూ.. తమ డివిజన్‌లో అధికారులు పర్యటించి సమస్యలు తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. త్వరితగతిన కాలువల నిర్మాణాలు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ టౌన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి. త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు సాంకేతిక సమస్యలుంటే వాటిని సిబ్బంది సరి చేస్తారన్నారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కొండవెలగాడ, చంద్రంపేట, టెక్కలి, ఎల్ఎన్ పురం, తాళ్లపూడిపేట గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

డెంకాడలో..

డెంకాడ: విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్ల నిర్వహణ పనుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ జ.సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. డెంకాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెదతాడివాడ, ఊడికులపేట గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు.. మోపాడ రూరల్ ఫీడర్ పరిధిలోని మోపాడ, జగన్నాథపురం గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పింఛన్‌దారులు

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ పింఛన్‌దారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పలువురు పింఛనుదారులు గురువారం స్థానిక కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షన్‌దారుల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్.ప్రకాశరావు, జి.భాస్కరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 25న లోక్‌సభలో ఆర్థిక బిల్లు ఆమోదించిందని, ఆ బిల్లులో పెన్షనర్లకు ఇకపై పే రివిజన్ జరగదని పొందుపరిచారన్నారు. 60 ఏళ్లకు పదవీ విరమణ చేసినప్పుడు ఎంత పెన్షన్ ఇస్తారో.. అదే పెన్షన్ తాను మరణించేంత వరకు అందుకోవాల్సి వస్తుందని చెప్పారు. ఈ సవరణ పెన్షనర్లకు, ఫ్యామిలీ పెన్షనర్లకు చాలా అన్యాయం చేస్తుందన్నారు. ఆర్థిక బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ పెన్షనర్లు చేసిన ధర్నాకు బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, వర్కింగ్ ఎంప్లాయీస్ పూర్తి మద్దతు ఇస్తున్నాయని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆలుగు వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ కార్యదర్శి డి.సుబ్బారావు, సుగుణాకరరావు, పింఛనుదారులు పాల్గొన్నారు.